## వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎంఆర్, ఐడీ) మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎంఈడీ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్, బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) (ఐడీ, ఐ, డీ, హెచ్ఐ, ఏఎస్డీ) మూడు సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

## లా కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: వివిధ లా కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేండ్ల ఎల్ఎల్బీ, మూడేండ్ల ఎల్ఎల్బీ ఆనర్స్ కోర్సుల రెండు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్, మొదటి, ఐదో సెమిస్టర్ ఇంప్రూవ్మెంట్, ఐదేండ్ల బీఏ ఎల్ఎల్బీ, ఐదేండ్ల బీబీఏ ఎల్ఎల్బీ, ఐదేండ్ల బీకాం ఎల్ఎల్బీ కోర్సుల రెండు, ఆరు, ఎనిమిది, పదో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్, ఇంప్రూవ్మెంట్ పరీక్ష ఫీజును ఈ నెల 30వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ. 200 అపరాధ రుసుముతో వచ్చే నెల 5వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## కంప్యూటర్ అప్లికేషన్స్ డిప్లొమా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్ సీడీఈ) ద్వారా అందించే కంప్యూటర్ అప్లికేషన్స్ డిప్లొమా కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్ కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్, అడ్వాన్స్ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సుల పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, ఫలితాలను తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మార్కు మెమోలను సంబంధిత కళాశాల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చన్నారు. రీవాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్ కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 17వ తేదీలోగా, రూ.200 అపరాధ రుసుముతో 19వరకు టీఎస్ ఆన్లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 17 వరకు చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ లో చూసుకోవాలని సూచించారు.

# నిరంతరం అందుబాటులో ఉంటా

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బేగంపేట్, జూన్ 13: నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం బేగంపేట డివిజన్‌లో పర్యటించి రూ.76 లక్షల నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. రూ.48 లక్షల వ్యయంతో స్విమ్మింగ్‌పూల్ షెడ్డు నిర్మాణం, ఎస్ఎస్ ఫ్లోరింగ్, పెయింటింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పాటిగడ్డ పార్క్ వద్ద రూ.19.50 లక్షల వ్యయంతో గేట్ ఏర్పాటు, టాయిలెట్స్ నిర్మాణం, ఎస్ఎస్ ఫ్లోరింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా వికార్‌నగర్‌లో రూ.8.50 లక్షల వ్యయంతో సీసీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్విమ్మింగ్ పూల్‌కు వచ్చే, పాటిగడ్డ పార్క్‌లో కరాటే నేర్చుకునేందుకు వచ్చే విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని వారికి కనీస సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వికార్‌నగర్‌లోని కొన్ని ప్రాంతాలలో డ్రైనేజీ లైన్ పనులు పూర్తి చేశామని చెప్పారు. రోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్‌గౌడ్, బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ డాకునాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ వాటర్ వర్క్స్ డీజీఎం శానిటేషన్ డీఈ వెంకటేష్, ఎలెక్ట్రికల్ ఏడీఈ శివదుర్గాప్రసాద్, కిషోర్, బీఆర్ఎస్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, ఆకుల హరికృష్ణ, నాయకులు శ్రీహరి, నరేందర్, శేఖర్, ఆరీఫ్, కిషోర్, అఖిల్, మొయినోద్దీన్, గిరి, నాగరాజు, నాని తదితరులు పాల్గొన్నారు.


బేగంపేటలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్

## ఆసియా కప్ పోటీలకు ఎంపికైన ప్రవళిక


ప్రవళికను అభినందిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, జూన్ 13: సీతాఫల్‌మండికి చెందిన సాఫ్ట్ బాల్ క్రీడాకారిణి చేపుర్వ ప్రవళిక ఆసియా కప్ పోటీలకు ఎంపికైంది. చైనాలో నిర్వహించే ఈ పోటీలకు తెలంగాణ నుంచి భారత్ పక్షాన ఆమె ఎంపికైంది. సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రవళికను సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ ఘనంగా సత్కరించారు. గతంలో రాష్ట్రం తరపున 25కు పైగా జాతీయ, అంతర్జాతీయ వేదికలపై సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొన్న ప్రవళిక వరుసగా మూడో సారి అంతర్జాతీయ స్థాయిలో ఎంపికైనట్లు తెలిపారు. భవిష్యత్తులో మరింతగా రాణించి తెలంగాణ ఖ్యాతిని ఇనుమడింప చేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

## డ్రైనేజీ ఓవర్‌ఫ్లోపై చర్యలు తీసుకోవాలి


అధికారులతో కలిసి డివిజన్ పరిధిలో పర్యటిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, జూన్ 13: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో కార్పొరేటర్ హేమ అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఇక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మేడిబావి పరిధిలోని జై భవానీ ఆలయం వద్ద డ్రైనేజీ తరచుగా ఓవర్ ఫ్లో అవుతుందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. నూతన సీవరేజీ లైన్ గతం కంటే ఇప్పుడు పెద్ద పైప్ లైన్ వేయాలని అధికారులకు సూచించారు. సీసీరోడ్ ఇప్పటికే మంజూరు అయినట్లు త్వరలోనే పనులు చేపడతామని ఆమె స్థానికులకు తెలిపారు. అనంతరం ఆర్యసమాజ్, నామాలగుండు, చిలకలగూడ ప్రాంతాల్లో డ్రైనేజీ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తుగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాకాలం సందర్భంగా అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ కుషాల్, జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకులు రాజు, వెంకట్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ హయాంలోనే మెరుగైన వసతులు


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మి, నాయకులు

అమీర్‌పేట్, జూన్ 13: బడిబాటలో భాగంగా శుక్రవారం సనత్‌నగర్‌లోని రౌండ్ టేబుల్ ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీ, అక్షరాభ్యాసం ఘనంగా జరిగాయి. సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మి దంపతులు పాల్గొన్న కార్యక్రమంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేసి, చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించినట్లు గుర్తుచేశారు. సకల వసతులతో పాటు పాఠ్యపుస్తకాలు అందిస్తూ, మధ్యాహ్న భోజనాలు అందుబాటులోకి తెచ్చి విద్యార్థుల చదువులకు అన్ని విధాలా చేయూతనందిస్తుండడం వల్ల కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని కలిగించడంతో పాటు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఉపాధ్యాయుల పనితీరు అభినందనీయమని అన్నారు. విద్యార్థులు చదువులో రాణించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు బ్రహ్మాచారి, మేరి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీదేవి, భాస్కర్, డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఖలీల్ బేగ్, సనత్‌నగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేష్‌ముదిరాజ్, దుర్గేష్ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీఏ అధికారుల తనిఖీలు

ఉప్పల్, జూన్ 13: ఉప్పల్‌లోని పలు ప్రాంతాల్లో ఉప్పల్ ఆర్టీఏ అధికారులు శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ఫిట్‌నెస్ లేని వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై తిరిగే వాహనదారులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిబంధనలు పాటిస్తూ చట్టాన్ని గౌరవించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## విమాన దుర్ఘటన మృతులకు నివాళి

చిక్కడపల్లి, జూన్ 13: బాగ్లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లా కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు శుక్రవారం గుజరాత్ అహ్మదాబాద్‌లో విమాన దుర్ఘటనలో మృతి చెందినవారికి ఘననివాళి అర్పించారు. గుజరాత్ హైకోర్టు, న్యాయవాదుల సంఘం మద్దతుతో, సామూహిక సంతాపం కోసం ఇచ్చిన పిలుపులో భాగంగా రెండు నిమిషాల మౌనం మనం పాటించారు.



## బాక్సింగ్ పోటీల్లో తార్నాక విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన బాక్సర్లను సన్మానించిన కోచ్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో తార్నాకకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభ చాటి రెండు బంగారు పతకాలు, మరో కాంస్య పతకం సాధించారు. ఇటీవల నిజామాబాద్‌లో నిర్వహించిన ఆరో జూనియర్ అండర్ 17 స్టేట్ బాక్సింగ్ చాంపియన్షిప్-2025లో తార్నాకలోని స్పోర్ట్స్ స్క్వేర్ విద్యార్థులు భార్గవ్ (48-50 కిలోల విభాగం), శ్రేయన్స్ (46-48 కిలోల విభాగం) బంగారు పతకాలు, జోయన్ (80 కిలోలపై విభాగం) కాంస్య పతకం సాధించి, జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వారిని స్పోర్ట్స్ స్క్వేర్ డైరెక్టర్ సందీప్‌రెడ్డి, కోచ్ హేమంత్‌కుమార్ ఘనంగా సన్మానించారు. యువకులు మరిన్ని ఈవెంట్లలో రాణించి గొప్ప పేరు సంపాదించాలన్నారు.

## గంజాయి అమ్ముతున్న ఇద్దరు అరెస్ట్


గంజాయి తరలిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసిన ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు

ముషీరాబాద్, జూన్ 13: గుట్టు చప్పుడు కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి గంజాయిని తీసుకొచ్చి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ డి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ముషీరాబాద్ గంగపుత్రకాలనీకి చెందిన రాజేష్ (21), దినేష్‌రెడ్డి (25) కొంతకాలంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం, అరకు నుంచి గంజాయి తీసుకువచ్చి రహస్యంగా విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ముషీరాబాద్ పార్సిగుట్ట చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా హుండాయ్ కారులో 9కిలోల గంజాయిని గుర్తించారు. వెంటనే దినేష్, రాజేష్ అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారు వాడిన కారును, రెండు సెల్ ఫోన్లను సీజ్ చేశామని సీఐ రామకృష్ణ తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో అక్షరాభ్యాసం


ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసంలో వెంకటేషన్‌రాజు, ఉపాధ్యాయులు

బన్సీలాల్‌పేట్, జూన్ 13: న్యూబోయిగూడ, ఐడీహెచ్‌కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బడిబాటలో భాగంగా విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్‌రాజు హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దేవిక, ఉపాధ్యాయులు మమత, సంధ్య పాల్గొన్నారు.

## డీడీఎంఎస్ కోఫేమ్ లో వివిధ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్ (డీడీఎంఎస్ కోఫేమ్)లో వివిధ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల చైర్పర్సన్ డాక్టర్ వై.రమాప్రభ, సెక్రెటరీ భవాని, ప్రిన్సిపాల్ కె.విజయ తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఈ కోర్సులను అందించనున్నట్లు చెప్పారు. బీఏ కర్ణాటక సంగీతం (ఫుల్ టైం), ఎంఏ కర్ణాటక సంగీతం (పార్ట్ టైం ఇన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్) కోర్సులలో చేరేందుకు కేవలం మహిళలే అర్హులని పేర్కొన్నారు. కర్ణాటక వోకల్‌లో ఒక సంవత్సరం బ్రిడ్జి కోర్సు, డెవోషనల్ మ్యూజిక్ (సంకీర్తన)లో ఆరు వారాల సర్టిఫికెట్ కోర్సు, వీణ, వయోలిన్, కీబోర్డ్, ఫ్లూటలో ఒక సంవత్సరం సర్టిఫికెట్ కోర్సు, సౌందర్య లహరి, క్లాసికల్ డాన్స్, వెస్టన్ డాన్స్, ఫోక్ డాన్స్, ఆర్ జే, వాయిస్ ఓవర్, యాక్టింగ్, యాంకరింగ్, న్యూస్ రీడింగ్, రిపోర్టింగ్, ఎడిటింగ్, డబ్బింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్లో సర్టిఫికెట్ కోర్సు, టెక్చర్ ఆర్ట్, రెసిన్ ఆర్ట్, లిప్పన్ ఆర్ట్, క్యాండిల్ మేకింగ్, తంజావూర్ పెయింటింగ్, కార్టూనింగ్, డాల్స్ మేకింగ్, క్రోచెట్, స్టోరీ టెల్లింగ్ విత్ ఫ్లాష్ కార్డ్స్, బ్యూటీషియన్, హెయిర్ స్టైల్స్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ తదితర అంశాల్లో సర్టిఫికెట్ కోర్సులను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అన్ని కోర్సుల్లో చేరేందుకు మహిళలతో పాటు పురుషులు కూడా అర్హులని వివరించారు. వీటిని ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు 94417 68811, 93939 49415 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## వ్యభిచారం నిర్వహణ.. నిందితులు రిమాండ్

### రెస్క్యూహోంకు ఇద్దరు బాలికలు

బొల్లారం, జూన్ 13: గుట్టుచప్పుడు కాకుండా తిరుమలగిరిలో ఓ ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమ బెంగాల్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు తిరుమలగిరిలోని ఓ ఇంటిలో గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తునారన్న సమాచారంతో శుక్రవారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఇద్దరు మైనర్ బాలికలను అదుపులోకి రెస్క్యూహోంకు తరలించారు. నిందితులు హన్నాన్ మొల్లాయి, మిరాజిల్ మండల, రేప్ప, రమేష్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# 'హననం ఆపి.. శాంతి చర్చలు జరపండి'


అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ వెన్నెల

జవహర్‌నగర్, జూన్ 13: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులపై మారణహోమం సృష్టించడం దుర్మార్గమని తెలంగాణ సాంస్కృతిక సారథి, చైర్‌పర్సన్ డాక్టర్ గద్దర్ వెన్నెల నిలదీశారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో క్రాంతి కళా బృందం ఆధ్వర్యంలో శుక్రవారం 'ఆదివాసీల హననం ఆపండి.. శాంతి చర్చలు జరపండి' అంటూ అఖిలపక్ష నాయకుల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ వెన్నెల హాజరయ్యారు. ప్రధాని మోదీ, అమిత్‌షా పారా మిలటరీ బలగాలతో మారణహోమం సృష్టించడం సరికాదని పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరుపాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. 17న ధర్నాచౌక్‌లో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిలపక్ష, ప్రజా సంఘాల నాయకులు మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, శ్రీకాంత్‌యాదవ్, ఉమామహేశ్, ఐఎఫ్‌టీయూ నాయకురాలు అనురాధ, చంద్రమౌళి, షేక్ షావలీ, నగేశ్, సీఎల్ యాదగిరి, ఎస్‌కే మీరా, మోహన్ బైరాగి, శివబాబు, వెంకటాచారి, సునీత, నాగరాజు, ప్రకాశ్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

# పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


ప్రభుత్వ పథకాలపై స్థానికులకు వివరిస్తున్న అంకిత సంస్థ సిబ్బంది

బన్సీలాల్‌పేట్, జూన్ 13: పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల గురించి శుక్రవారం బోయిగూడలోని గొల్లకొమరయ్యకాలనీ వద్ద ప్రజలకు అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అంకిత స్వచ్ఛంద సంస్థ సిబ్బంది సుజాత, స్వప్నలత మాట్లాడుతూ కార్మికుల కోసం లేబర్ గుర్తింపు కార్డులను పొందాలని, చేతివృత్తుల వారు ఈశ్రమ్ నమోదు చేసుకోవాలని, ఆడపిల్లల భద్రత కోసం కోసం సుకన్య సమృద్ధి యోజన, ప్రమాద బీమా కోసం పోస్టల్ బీమా ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. గొల్ల కొమరయ్య కాలనీ అధ్యక్షుడు కేఎం కృష్ణ, మహేష్, సెల్వరాజ్, కిషన్ బస్తీవాసులు పాల్గొన్నారు.

## బస్సు చార్జీల పెంపు ప్రజాస్వామ్య విరుద్ధం

చిక్కడపల్లి, జూన్ 13: రాష్ట్రంలో 20శాతం బస్సు చార్జీల పెంపు ప్రజాస్వామ్య విరుద్ధమని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులూ విజయ్ మల్లంగి మండిపడ్డారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్, బస్సు భవన్ వద్ద శుక్రవారం ఆప్ రాష్ట్ర నాయకుడు రాకేష్‌సింగ్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. విజయ్ మాట్లాడుతూ అధిక బస్సు చార్జీల పెంపు, నిత్యావసర వస్తువుల ధరలతో పేదలపై భారాన్ని పెంచుతుందని అన్నారు. చార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో తమ ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆప్ నేతలు సుధారాణి, డా.లక్ష్మనాయుడు, బాబూలాల్ పవార్, రాకేష్ రెడ్డి, ఆఫస సలాం, జావీద్ షరీఫ్, ఎండీ సోహైల్, ఎండీ షాబాజ్, డి.తివారి, రెహమాన్ షరీఫ్, జుహీ, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## మృతుడికి ఎమ్మెల్యే నివాళి

బన్సీలాల్‌పేట్, జూన్ 13: జీవైఆర్ కాంపౌండ్ డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన గౌరె రమేష్ (41) గురువారం భవనంపై నుంచి దూకి మరణించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ శుక్రవారం అక్కడికి చేరుకొని రమేష్ మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు లక్ష్మిపతి, ప్రేమ్‌కుమార్, కాలనీ అధ్యక్షుడు వెంకట్‌బాబు తదితరులు ఉన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, జూన్ 13: టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కెవి టూరిస్ట్ హోటల్, ప్రివెంటివ్ మెడిసిన్, విద్యానగర్, బాలాజీ నగర్, బర్కత్ పుర ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అజామాబాద్ డివిజన్ ఏడీఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు టూరిస్ట్ హోటల్, ప్రివెంటివ్ మెడిసిన్ ఫీడర్ల పరిధిలోని టూరిస్ట్ హోటల్, చెప్పల్ బజార్, బజాజ్ షోరూం, కాచిగూడ మెయిన్ రోడ్, గౌరమ్మగల్లి, రాజీవ్ గాంధీ నగర్ కమ్యూనిటీ హాల్, సాయిబాబా కమాన్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు విద్యానగర్ ఫీడర్ పరిధిలోని రాంనగర్ గుండు, అడిగిమెట్, విద్యానగర్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బాలాజీనగర్, బర్కత్ పుర ఫీడర్ల పరిధిలోని బాలాజీనగర్, అడిక్‌మెట్, లలితనగర్, బర్కత్‌పుర, పద్మకాలనీ, శంకర్‌మఠ్ కూరగాయల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు.

## వర్షానికి కూలిన పైకప్పు

బన్సీలాల్‌పేట్, జూన్ 13: గురువారం రాత్రి కురిసిన వర్షం కారణంగా రామస్వామి కాంపౌండ్‌లో ఓ పాత ఇంటి పైకప్పు కూలింది. ఈ సంఘటనలో ఎవరికి గాయాలు కాలేదు. శోభ, శ్రీనివాస్ దంపతులు కొన్నేండ్ల నుంచి కుటుంబ సమేతంగా అదే ఇంట్లో నివసిస్తున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెంటనే ముషీరాబాద్ తహసీల్దార్‌కు ఫోన్‌చేసి బాధితులకు సహాయం అందించాలని ఆదేశించారు. కూలిన ఇంటిని బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్‌రాజు, లక్ష్మిపతి, ప్రేమ్‌కుమార్, శాంతికుమార్, నాగభూషణం, సురేష్ సందర్శించారు.